# పెంపకం

ఆ మధ్య మేము ఒక స్నేహితులింటికి వెళ్ళాము. వారేమంత దగ్గిర స్నేహితులు కారు. రైలులో తటస్థపడి, మర్యాదగా పిలిచారు మమ్మల్ని వారింటికి. శాంతాదేవి యిలాటి స్నేహితులపట్ల ఒకప్పుడు ఎంతో ప్రేమాభిమానాలు కనబరుస్తుంది; మరొకప్పుడు అంటీ ముట్టనట్టు వూరుకుంటుంది. అదంతా వారూ మేమూ కలుసుకున్నా వేళా విశేషాన్ని బట్టి వుంటుంది. ఏమయితేనేం, శాంతాదేవి యిష్టపడింది గనక మేము ఈ రైలుస్నేహితు లింటికి వెళ్ళాము.

ఇద్దరమూ హాలులో పాదం పెట్టామో లేదో "రండి—లోపలికి రండి" అని రమణీయ కంఠ మొకటి మమ్మల్ని ఎంతో ఆదరంతో ఆహ్వానించింది. ఆ సన్నటి కంఠస్వరం ఏమూల నించా అని మేము బితుకూ బితుకూ చూస్తూవుండగా యింటాయనా యింటావిడా ప్రత్యక్షమై మేము కూచునేందుకు కుర్చీలు చూపారు.

మేము వెర్రిగా నాలుగు వైపులకు చూస్తూవుండగా, యింటాయన సగర్వంగా మమ్మల్ని పంజరం దగ్గరికి తీసుకువెళ్ళి చిలకనిచూపించాడు.

"ఎంత బావుందో!" అంది శాంత.

"బావున్నారా?" అని అడిగింది చిలక.

శాంతాదేవి తన ఆనందం పట్టలేక పోయింది. ఇంటాయన తను ఆ చిలకని ఎలా పట్టి తెప్పించిందీ, దానికి మాటలు

ఎంతకష్టపడి నేర్పినదీ, అది తమ గృహానికి ఎలాటి అందాన్ని యిస్తున్నదీ వన్నెచిన్నెలుగా చెప్పాడు. శాంతాదేవి దోర చెవులు పెట్టుకుని వింది చిలక కథ యావత్తూ.

♦ ♦ ♦

"ఏమండీ మనం కూడా ఒక చిలకని పెంచుకుంటే!" అంది శాంత, మేమిద్దరమూ యింటికి వస్తున్నప్పుడు.

ఏదో మునుచుకొస్తోందని నాకు తెలుసు.

"చిలకని పెంచేందుకు ఏమంత ఖర్చుకాదు. కాసిని గింజలు దానిముందుపోస్తేచాలు. రామచిలకని పెంచుకుంటే యిల్లు ఎంత ముచ్చటగా ఉంటుంది!" అంది శాంతాదేవి.

నేనేమీ మాట్లాడలేదు. వెనక సీతాదేవి శ్రీరాముల వారిని బంగారు లేడి కోరింది. ఈ నాడు శాంతాదేవి నన్ను రామచిలుక తెచ్చి పెట్టమని అడుగుతోంది. ఒక ప్రాణిని పెంచడం మాటలా ? నా కిష్టంలేదు యిలాటి వెర్రిమొర్రి పనులు. కాని ఆ మాట పైకి ఎలా చెప్పేది ? లౌకికజ్ఞానం లేనిదే ప్రపంచంలో దమ్మిడీకి కొరగాము.

"ఏమండీ—మాట్లాడరేం ?"

"శాంతా, చిలకని పెంచడం మహాపాపం. 'ఎందుకైతే వుంచినావో బందిఖానాలో' అన్నాడు రామదాసు. వెనకటి జన్మలో పన్నెండేళ్ళు చిలకని పంజరంలో పెట్టి వుంచాడట. అందుకనే అతను మరుసటి జన్మలో జైలులో ఉండవలసి

వచ్చింది. రెక్కలు కట్టుకుని గాలిలో స్వేచ్ఛగా ఎగరవలసిన పక్షిని పంజరంలో బంధించడం ఏమి న్యాయం ?"

"లోకంలో న్యాయం ఎక్కడుంది ?" అని ప్రశ్నించింది శాంతాదేవి.

"లోకం మాట తరువాత చూదాం. హాయిగా గాలిలో ఎగురవలసిన పక్షిని పంజరంలో పడేసి వుంచడం ఏమంత మంచిపని ?"

శాంతాదేవి రామదాసు కథ నమ్మివుండదుగాని, ముద్దొచ్చే రామచిలక మనకోసం రెక్కలు విరగకొట్టుకోవడం మంచిపని కాదనుకుని ఉంటుంది. రెండు రోజుల పాటు మళ్ళీ రామచిలక ప్రసక్తి రాలేదు.

♦ ♦ ♦

ఒకరోజు సాయంత్రం ఆఫీసు నించి యింటికివచ్చి, యథాప్రకారం ఫ్లాస్కులో టీ గ్లాసులోకి వొంపుకు తాగుతూ వుండగా కాళ్ళ దగ్గిర మెత్తగా తగిలింది. ఆ ఖంగారులో టీ చొక్కామీద కూడా పడింది. కాళ్ళదగ్గిరవున్న పిచ్చిముండ 'మ్యావ్ మ్యావ్' అంది.

"ఈ పిల్లిపిల్ల మధ్యాహ్నం పదకొండు గంటల నించీ మన యిల్లు వొదలడంలేదు. ఈ గదిలోనుంచి తరుముతే ఆ గదిలోకీ, ఆ గదిలోనుంచి తరుముతే ఈ గదిలోకీ వస్తోంది. ఇందాక పని మనిషిని సందు చివర వొదిలిపెట్టి రమ్మన్నాను. పీడ వొదిలింది గదా అనుకుంటే, మళ్ళీ పది

నిమిషాలకి వచ్చి, వీధి తలుపు వెనక భయపడుతూ నక్కింది. అప్పుడు దాన్ని చూస్తే మహాజాలివేసింది సుమండీ. పింగాణీ పళ్ళెంలో కాసిని పాలుపోసి అక్కడ పెట్టాను. వెర్రిముండ ఆవురావురుమంటూ తాగింది.'' అంటూ పిల్లి చరిత్ర చెప్పింది శాంతా దేవి.

నాకు తక్షణం ఎమిలీ జోలా రాసిన పిల్లి కథ జ్ఞాపకం వచ్చింది. ఒక పెంపుడు పిల్లి స్వేచ్ఛకోసం, పట్టుపరుపుల మధ్య పెరుగుతున్న తన సుఖాన్ని కాలదన్ని, విశాల ప్రపంచంలోకివచ్చి వుక్కిరి బిక్కిరై, జఠరాగ్ని భరించ లేక తన యజమానురాలి దగ్గర కే తిరిగి పోవడానికి నిశ్చయించు కుంటుంది. నేను కథలూ, పత్రికలూ అంతగా చదవను గాని పిల్లిని చూసినప్పుడల్లా, ఆ పాత కథ ఎందుకో జ్ఞాపకంవస్తూ వుంటుంది. ఆ కథ జ్ఞాపకం వచ్చి, కాళ్ళదగ్గిర పడివున్న పిల్లిపిల్ల వంక ఎంతో అనురాగంతో చూశాను.

తెల్లగా వుంది. వెన్నుమీదా, పొట్టకిందా, తోకదగ్గిరా, నల్లమచ్చలు మరింత అందాన్ని చేకూర్చాయి. శాంతా దేవీ, నేనూ ఆ పిల్లి పిల్ల వయసు నిర్ణయించడానికి ప్రయత్నించాము గాని యిదమిత్థమని తేల్చ లేకపోయాము.

''పుట్టి వారంరోజులై ఉంటుంది'' అంది శాంతా దేవి.

''నెల్లాళ్ళయి వుంటుంది'' అన్నాను నేను.

''పిల్లి ఎన్నేళ్ళు బతుకుతుంది ?''

''పన్నెండేళ్ళు''అన్నాను; సరిగ్గా నాకు తెలీదు.

"ఇంతేనా పాపం" అంది శాంతాదేవి దాని ఆ ఋర్ధాయు పరిమితికి జాలిపడుతూ.

ఆ మర్నాటినుంచీ పిల్లిపిల్ల మాలో ఒకటి అయిపోయింది. నేను ఆఫీసుకి వెళ్ళినప్పుడు శాంతాదేవికి ఎంతో సాయంగా ఉండేదట. సాయంత్రం నేను వచ్చిన తర్వాత నా వొళ్ళో కూచుని ఆటలాడేది. 'టైగర్' అని పిలిస్తే, ఏ మూలవున్నా చరచరా పరిగెత్తుకు వచ్చేది. మేమిద్దరమూ టైగర్‌ని చూసుకుని మురిసిపోతూ వుండేవాళ్ళము.

ఎంతటి సౌఖ్యానికీ అంతరాయం తప్పదంటారుగా పెద్దలు! ఒక రోజు ఉదయం పడకగదిలో ఎలక చచ్చిపడి వుంటే మాకు అర్థం కాలేదు. టైగర్ అలాంటి నీచపుపని చెయ్యదనుకున్నాము. పాలు, రొట్టె పెడుతున్నప్పుడు టైగర్ ఎలకల మీదికి ఎందుకు పురకాలి? అదీగాక, మేము దీన్ని ఎలకల్ని చంపేందుకుగాను పెంచడంలేదు. ఎలకల కోసమయితే కత్తెరబోను పెట్టి వుందుము. ఈ టైగర్‌ని ఆదర్శప్రాయంగా పెంచాలని తహతహలాడాము; శాకాహారిగానే ఉంచాలనుకున్నాము.

ఒక రోజు మధ్యాహ్నం నేనూ శాంతాదేవీ ఎవరో మిత్రులతో హాలులోకూచుని కబుర్లు చెప్పుకుంటూ వుండగా, ఒక ఎలకని నోట గరుచుకుని, టైగర్ అక్కడికి వచ్చింది. తన ప్రతాపం మాకు చూపాలని దాని ఉద్దేశమై ఉంటుంది. ఆ విషయం నేను ఎంత చెప్పినా వినక శాంతాదేవి దాని

మీదికి ఇనప గరిట విసిరింది. టైగరు హడిలిపోయి పలాయనమంత్రం చిత్తగించింది.

తప్పిపోయిన కొడుకుకోసం పేపర్లలో ప్రకటించి, ప్రతి దినం పోస్టుకోసం ఎదురుచూసే తలిదండ్రులలా టైగరుకోసం వారం రోజులు ఎదురు చూశాం. తను తొందరపడ్డానని శాంతాదేవి ఒప్పుకుంది. కాని టైగరు ఏమైపోయిందో జాడ తెలియ లేదు.

* * * *

"కుక్క విశ్వాసము గల జంతువు. దొంగల భయం ఎక్కువగా వుంది కనక మనం ఒక కుక్కని పెంచుకుందాం" అంది, పిల్లిని పెంచడానికి అలవాటుపడ్డ శాంతాదేవి.

"బెడదల్లేకుండా నిమ్మళంగా ఉండలేవుకదా!" అన్నాను.

"అది కాదండీ—సుమతి బావగారు బెంగుళూరునుంచి రెండు కుక్కలని తీసుకువచ్చారట. ఒకటి బ్రవునుది, మరొకటి బ్లాక్‌ది. ఒకటి మనమడిగి పుచ్చుకుందాం."

నాకసలు పెంపుడు జంతువులంటే గిట్టదు. ఆ పిల్లి అయినా కాళ్ళదగ్గర కొచ్చింది గనక పొమ్మనలేకపోయాను. ప్రాణాన్ని సుఖంగా ఉంచుకోవడం చేతగాక గాని, ఎందుకీ అనవసర ప్రమేయాలు? కుక్కకి భయపడి ఎక్కడైనా దొంగ దొంగతనం చెయ్యడం మాన్తాడా? మనసులోవున్న మాట శాంతాదేవితో అన్నాను.

"మీా రెప్పుడూ యింతే. కాలికి వేస్తే వేలికీ, వేలికి వేస్తే కాలికీను. చక్కటి బొమ్మకుక్క యింట్లో వుంటే యింటికి ఎంత అందం!"

చిట్టచివరికి శాంతాదేవి సుమతి బావగారిని 'రెండుకుక్క పిల్లలలో ఒకటి యివ్వకూడదా!' అని అడగనూ అడిగింది. ఆయన యివ్వనూ యిచ్చారు. నల్ల కుక్కపిల్ల మహాముద్దుగా వున్నమాట నిజమే. బస్సులో మేము యింటికి వస్తున్నప్పుడు ఎందరో అడిగారు మమ్మల్ని—'అది ఎక్కడ కొన్నారూ?'-అని. ఇంటికి వచ్చేటప్పటికి శాంతాదేవి మొహం వెన్నెల విరిసినట్లయింది.

"కుక్క ఎన్నేళ్ళు బతుకుతుంది?" అని అడిగింది శాంతాదేవి.

"పదిహేనేళ్ళనుకుంటాను" అన్నాను. సరిగ్గా నాకు తెలీదు.

"ఇంతేనా పాపం!" అంది శాంతాదేవి, దాని ఆయుర్దాయ పరిమితికి కూడా జాలిపడుతూ.

కస్తూరి నెమ్మదిగా పెరిగి పెద్దదవ నారంభించింది. వీధి గుమ్మంలో చోద్యం చూస్తూ నిలబడ్డప్పటికీ 'కస్తూరీ' అని పిలవగానే, తోక ఆడించుకుంటూ లోపలికి వచ్చేది. సైగకి మళ్లే ఒక మూలనక్కి కూచోక, మా వెంట వెంట తిరుగుతూ వుండేది.

ఒకరోజు వుదయం పెద్ద అట్టమీాద తెల్ల కాయితం అంటించి రంగు పెన్సిల్ పుచ్చుకుని కూచున్నాను.

"అదేమిటి" అంది శాంత.

"Beware of Dog అని బోర్డు రాసి వీధి వాకిలికి తగి లిస్తాను."

"ఊరుకోండి. మన కస్తూరి అల్లరిది కాదు. ఎవరిమీదా పడి కరవదు. దీనికి కుక్కబుద్ధులు లేవు" అంది శాంతాదేవి కస్తూరిని సమర్థిస్తూ.

"కుక్కకి కుక్క బుద్ధులు ఉండటమే మంచిది. మనిషి బుద్ధులు వుంటే మరీ ప్రమాదం."

"ఏదో మాటకి మాట వొప్పజెప్పాలని అంటారు" అని చేతిలోని అట్టా పెన్సలూ లాక్కుంది శాంతాదేవి.

మేమంటే కస్తూరిని నెత్తి నెక్కించుకుంటాము గాని యింటికివచ్చిన ప్రతివాళ్ళకీ దానిమీద ప్రేమ ఎందు కుంటుంది? గొలుసు కొనక తప్పదని కస్తూరి మెడకి గొలుసు బిగించాను

వాళ్ళ రాజత్తవొచ్చి, పది రోజులపాటు వున్నప్పుడు శాంతాదేవి అవస్థచెప్పలేము. రాజత్తకి మడీ, ఆచారమూ, కుక్కని నడవలోకి కూడా రానిచ్చేది కాదు. "కుక్కల్ని వీధి వాకిట్లో కట్టేస్తారుగాని పడకటింట్లోకి తెచ్చుకుంటారా నాయనా!" అనేది ఆమె నాతో. వాళ్ళ రాజత్త వెళ్ళి పోయాక శాంతాదేవి ప్రాణం తెప్పరిల్లినట్లయింది.

ఈ పదిరోజుల్లోనూ కస్తూరి తనకి కాలక్షేపంగాక ఎదు రింటి రోజాతో స్నేహంచేసింది. కస్తూరి దుర్బుద్ధులు శాంతా

దేవికి నచ్చలేదు. కాని యిదికూడా సైగరుకి మల్లే పారిపోతుందేమోనని ఘట్టిగా గదమాయించేదికాదు.

ఒక రోజు సాయంత్రం కస్తూరి ఊరు చూడటానికని మూడు గంటలకి వెళ్ళి రాత్రి ఎనిమిదిన్నరదాకా రాలేదు. ఏ కారుకిందో పడి చచ్చి వుంటుందనుకున్నాము నేనూ, శాంతాదేవీ కూడాను. తోకాడించుకుంటూ కస్తూరి రాత్రి తొమ్మిది గంటలకి వచ్చేటప్పటికి, శాంతాదేవి మూలనున్న కర్రపుచ్చుకుని రెండు తగిలించింది. అది మొయ్యోమొయ్యోమని ఏడిచింది. ఆరాత్రి శాంతాదేవి దాన్ని పస్తు పడుకోబెట్టింది.

దాలిగుంటలోని కుక్క బుద్ధిలా నాలుగు రోజులపాటు గుమ్మం కదలక, అయిదో రోజున మళ్ళీ అదే పని చేసింది కస్తూరి. శాంతాదేవి ఇంక ఆగ్రహం పట్టలేకపోయింది. అది వస్తుందేమోనని కర్రపుచ్చుకుని గుమ్మంలో పదకొండుదాకా కూచుంది. కస్తూరి యింటికి రాలేదు.

రాత్రి పన్నెండు గంటలకి భోజనం చేస్తూ శాంతతో అన్నాను; "నువ్వు నిష్కారణంగా మనసు పాడుచేసుకుంటున్నావ్."

"మనసు కట్టేసుకో లేకుండా వున్నాను. తోచడం లేదు" అంది శాంతాదేవి చారు పోసుకుంటూ.

"ఉన్న మమకారాలు చాలక, యివి కూడా ఎందుకు మనకి?"

"నిజమే అనుకోండి. కాని ఇప్పుడేమి చేసేది ?" ఆమె కళ్ళల్లో నీళ్ళు పేరుకున్నాయి.

నేనే రాజకుమారుణ్ణి అయితే, అప్పటి కప్పుడు కస్తూరిని తీసుకువచ్చి యిచ్చివుండును నే నామెకి. నేను రాజకుమారుణ్ణికాదు ఆమె పెళ్ళి కావలసిన రాకుమార్తె కాదు.

తెల్లారిన తర్వాత మా పనిమనిషిని చెప్పింది "మన కస్తూరి నిన్నరాత్రి పక్కవీధిలో కారుకిందపడి చచ్చి పోయింది" అని.

కస్తూరిని కడసారి చూస్తానని శాంతాదేవి అనలేక పోయింది. నేను పక్కవీధిలోకి వెళ్ళి తగు ఏర్పాటులు చేశాను.

*  *  *  *

"మనకి పెంపుడు జంతువులు అచ్చిరావు. అందుకని మనమింక దేన్నీ పెంచుకోవద్దు" అంది శాంతాదేవి కస్తూరి మరణించిన నెల్లాళ్ళకి.

"పోనీ, మెట్టమొకట అనుకున్నట్టు రామచిలుకని పెంచుకుందామా ? పంజరంలో పడేసి వుంచుతాము గనుక అది మనం చెప్పినట్లువిని, చిలకపలుకులు పలుకుతుంది. సైకిలులా అది పారిపోదు, కస్తూరిలా మనకి మనస్తాపం కలిగించదు" అన్నాను నేను.

"మరి రామచిలకలు ఎక్కడ దొరుకుతాయి ?" అంది. ఆమె కళ్లలోని ఆశ అనంతవాహినిలాఉంది.

"మనిద్దరం పిట్టలపట్టే వల తీసుకుని అడవిలోకి వెళ్దాం. అక్కడ ఏజామిచెట్టుమీదనో రామచిలకలు కనిపిస్తాయి. వల విసిరి వాటిని పట్టుకుందాం. మనకి ఒక్కటి చాలుగా!"

"పోనిద్దురూ! మీకంతా వేళాకోళంగా ఉంది. మీరు చిన్న నాపొట్టకు శ్రీరామరక్ష అంటారు. భూతదయ ఉంటేగా మీకు!"

"ఇంతకీ రామచిలక కావాలా వొద్దా?"

"రామచిలక వొద్దు గాని ఏనుగపిల్ల కావాలి."

"అదెందుకు?"

"గున్న ఏనుగని పెంచుకుంటాను."

"రాజుగారు దయతలచి ఏనుగని దానం చేశారట—అలావుంది నీతంతు."

"మనం రామచిలక కోసం అడవికి వెళ్ళడం నిజమైనప్పుడు, నేను గున్నఏనుగని పెంచుకోవడం మాత్రం ఎందుకు నిజంకాకూడదూ? మిగతవాటి మాట ఎలావున్నా ఎలకల్ని మాత్రం చక్కగా పెంచాను. రేపు మూడుగదులకీ మూడు ఎలక బోనులు పట్టుకురండి."

"రామచిలక మాటో?" అన్నాను.

"గున్న ఏనుగ సంగతో?" అంది శాంతాదేవి.